క్లుప్తంగా

మధుమేహంపై అవగాహన సదస్సు

సామర్లకోట: మండలంలోని ఉండూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటిస్ అంతర్జాతీయ కార్యక్రమాన్ని సామర్లకోట క్లబ్ అధ్యక్షురాలు సిరివరపు సుధారాణి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ మాజీ రీజియన్ చైర్మన్ చిత్తులూరి వీర్రాజు హాజరై అవగాహన కల్పించారు. సుగర్ టెస్టులు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు.

ఆపదమిత్రల పర్యటన


ఉండూరులో పర్యటించిన ఆపద మిత్రలు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరులో ఆపద మిత్రలు గురువారం పర్యటించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల ఆపదమిత్రలు వర్మీ కంపోస్టు యూనిట్‌ను సందర్శించారు. పంచాయతీ ఉప సర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, కార్యదర్శి కుమార్‌రాజా గ్రామ పరిస్థితిని వివరించారు. పర్యటన అనంతరం ఈటీసీకి వచ్చిన ఆపద మిత్రలు గ్రామంలో గుర్తించిన విషయాలపై మ్యాప్‌ను తయారు చేశారు. విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజరు కిరణ్మయి, ఈటీసీ ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, ప్రసాద్, బి.ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో నాగబాబు ప్రతిభ


నాగబాబును అభినందించిన కమిషనర్

సామర్లకోట: 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలో స్థానికుడైన యాతం నాగబాబు మూడు పతకాలు సాధించాడు. ఈనెల 10 నుంచి 12 వరకు పశ్చిమ బెంగాల్ అరవిందో స్టేడియంలో జరిగిన జాతీయ మాస్టర్ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో రెండు స్వర్ణ, ఒక కాంస్య పతకాలను సాధించారు. నాగబాబును మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ అభినందించారు. కాకినాడ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగంలో కాకినాడ సబ్ యూనిట్ అధికారిగా నాగబాబు పని చేస్తున్నారు. స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 2013 నుంచి 2023 వరకు జరిగిన వివిధ జాతీయ ఇండియా మాస్టర్స్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్ పరుగు పందెం 100, 200, 400, 800, 1500 మీటర్లు, రిలే విభాగాల్లో ఇప్పటి వరకు 60 పతకాలు సాధించినట్టు చెప్పారు. వాటిలో 15 బంగారు, 19 వెండి, 26 క్యాంస్య పథకాలు ఉన్నాయని వివరించారు.

దోమల నివారణకు స్ప్రేయర్లు అందజేత


గొల్లప్రోలులో కమిషనర్‌కు స్ప్రేయర్లు అందజేస్తున్న వర్తక సంఘం సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీలో దోమల నివారణకు స్థానిక కిరాణా వర్తక సంఘం గురువారం రెండు స్ప్రేయర్లను అందజేసింది. కిరాణా వర్తక సంఘం నాయకులు దంగేటి శ్రీరామకృష్ణ, నల్లా వీరబాబు, నూలు గణేష్, దంగేటి రాజా, కొత్త గణేష్ తదితరులు రెండు స్ప్రేయర్లను నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు కిరాణా వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కోర్టులో ఏసీల కాపర్ వైర్ల చోరీ


విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కాకినాడ క్రైం: కాకినాడ కోర్టులో దొంగతనం జరగడం కలకలం రేపింది. కోర్టుల ప్రాంగణంలో పలు న్యాయస్థానాల్లో జడ్జిల రూంలను అనుసంధానం చేసి ఉన్న ఏసీల కాపర్ వైర్లను ఆగంతకులు కత్తిరించి ఎత్తుకెళ్లారు. నాలుగో అదనపు జిల్లా కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మొబైల్ మెజిస్ట్రేట్ కోర్టుల ఏసీల కాపర్ వైర్లను దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కాకినాడ సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల వ్యవధిలో ఈ దొంగతనాలు చోటు చేసుకున్నట్లు భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం బార్ అసోసియేషన్‌లో ఇదే తరహాలో కాపర్ వైర్ల దొంగతనం జరిగితే పోలీసులకు ఫిర్యాదు చేసిన స్పందించలేదని బార్ బృందం పేర్కొంది.

దేవతలారా రారండి..!

- పాదగయ, పంచారామ క్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు


పాదగయ క్షేత్రంలో పసుపు వాయ వేస్తున్న మహిళలు


సామర్లకోటలో నంది వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో మహాశివ రాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పండితులు ఉదయం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం, అంకురార్పణతో ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. రాత్రి స్వామివారి కల్యాణోత్సవంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పసుపు వాయ వేశారు (దంచారు). ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని పెండ్లి కుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెలను చేశారు. వేలాది మంది భక్తుల నడుమ రాత్రికి స్వామివారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఈ నెల 21 వరకూ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు స్వామి వారికి కల్యాణ వస్త్రాలు సమర్పించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో ఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేశారు.

భీమేశ్వర కల్యాణోత్సవాలు ప్రారంభం

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధ లతో ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి వారికి కల్యాణం జరిగింది. ఉదయం అభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు బంగారు కిరీటంతో అలంకరణలు చేశారు. ఆలయంలో గురువారం నుంచి 21వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. 18న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక దర్శనాలకు ఆలయ అధికారులు జోరుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 19న రథోత్సవం, 21న స్వామి వారి శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సన్నిధిరాజు అంజిబాబు దీక్షాధారణ చేపట్టారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకటేశ్వరరావు, చీమలకొండ గోపాలం, రాకేష్‌శర్మ, శ్రీకాకుళపు విజయ్, చెరుకూరి రాంబాబులు పూజలు నిర్వహించారు. భక్త సంఘం నాయకులు బిక్కిన సాయి, తలుపుల అంజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాదగయ క్షేత్రంలో స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


దుర్గాడ శివాలయంలో స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న భక్తులు


కుమార రామభీమేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు


స్వామి వారికి కల్యాణ స్నానం చేయిస్తున్న అర్చకులు

భక్తుల చెంతకు స్వామి, అమ్మవార్లు..

కల్యాణోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం నంది వాహనంపై ఈఓ డి నాగమల్లేశ్వరరావు గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మీ, చల్లా కుమారి, భక్త సంఘం నాయకులు పాల్గొన్నారు. ఆలయం నుంచి రైల్వే గేటు మీదుగా గాంధీచౌక్ నుంచి చిన్న వీధి, పెద్ద వీధి, యార్లగడ్డ వారి వీధి, కొత్తూరు, అయోధ్యరామపురం, దేవీచౌక్ మీదుగా స్వామి వారి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. అనంతరం రాత్రి కల్యాణం జరిపించారు.


ప్రత్యేక అలంకరణలో బాలా త్రిపుర సుందరి అమ్మవారు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- డీఈఓ అన్నపూర్ణ
- ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ


విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీస్తున్న డీఈఓ అన్నపూర్ణ

కాకినాడ రూరల్: పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్టు డీఈఓ కేఎంవీ అన్నపూర్ణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి ఉపాధ్యాయులతో భేటీ అయ్యారు. పాఠశాలలో వసతులు, బోధన అంశాలపై ఎంఈఓ ఎల్.గణేష్‌బాబు, హెచ్ఎం పి.పుల్లయ్య వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను తీర్చిదిద్దేలా ఉపాధ్యాయులను ఆదేశించామన్నారు. ప్రణాళిక ప్రకారం పాఠ్యాంశాల బోధన, రివిజన్ చేపట్టాలని కోరామన్నారు.

ఘనంగా రాజశేఖరస్వామి కల్యాణం

కొత్తపల్లి: గ్రామంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో మేళతాళాలతో పల్లకీలో ఊరేగించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శుక్రవారం స్వామి వారికి అభిషేకాలు, లలితా పారాయణ, 18న కుంకుమ పూజలు, సదస్యం, 19న పాటల పోటీలు, 20న రథోత్సవం, తీర్థం, కోలాటం, 21న శ్రీపుష్పయాగంతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం తెలిపారు.


కొత్తపల్లిలో రాజశేఖరస్వామి కల్యాణం జరిపిస్తున్న పండితులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపల్లి: విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.ప్రసాద్ గురువారం తెలిపారు. మండలంలోని వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడ, అమీనాబాదు గ్రామాలతో పాటు నాగులపల్లి చెరువులకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిరుపయోగంగా మార్కెట్ షెడ్లు

- రోడ్లపై చేపల విక్రయాలు
- తరచూ ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని అధికారులు


అమీనాబాద్‌లో రోడ్డుపైనే చేపల వ్యాపారం చేయడంతో స్తంభించిన ట్రాఫిక్

కొత్తపల్లి: తీరప్రాంత గ్రామాల్లోని రూ.లక్షలతో నిర్మించిన మార్కెట్ షెడ్లు నిరుపయోగంగా మారాయి. చేపల వ్యాపారులు ఈ షెడ్లను వదిలేసి రోడ్లపై వ్యాపారం చేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. మండలంలోని అమీనాబాదు, మూలపేట, కొనపాపపేట గ్రామాల్లో చేపల వ్యాపారులకు ప్రభుత్వం ప్రత్యేకంగా షెడ్లను నిర్మించింది. వాటిని విడిచిపెట్టి ప్రైవేటు స్థలం, ప్రధాన రహదారిపై చేపల వ్యాపారం చేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నిర్మించిన షెడ్లలో వ్యాపారం చేయడం వలన పంచాయతీలకు కూడా ఆదాయం లభిస్తుంది. ఉప్పాడ-కోనపాపపేట బీచ్ రోడ్డులో మూలపేట, అమీనాబాద్ సెంటర్‌లో చేపల వ్యాపారం జోరుగా సాగుతుంది. ముఖ్యంగా ఆదివారం ఉదయం, సాయంత్రం మత్స్యకార మహిళలు రోడ్డుపై చేపలను విక్రయిస్తున్నారు. కొనుగోలు దారులతో రోడ్డు కిక్కిరిసిపోతోంది. గంటల కొద్దీ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఇక్కడ రోడ్డుపై తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా అధికారులు, పోలీసులు చూసి చూడనట్లుగానే వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

వలలు అల్లుకుంటూ..

అమీనాబాదులో మార్కెట్ నిర్వహించుకునేందుకు కొన్ని సంవత్సరాల క్రితం రూ.లక్షలతో షెడ్డు నిర్మించారు. మూలపేటలోని ఫిషరీష్, ఉపాధిహామీ నిధులు రూ.9లక్షలతో మార్కెట్ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఈ షెడ్లలో మత్స్యకారులు వలలు అల్లుకుంటున్నారు. ఈ షెడ్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాక పోవడంతో నిరుపయోగంగా మారాయి.


మూలపేటలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్డు

ప్రైవేటు స్థలంలో మార్కెట్

అమీనాబాదులో చేపల వ్యాపారులు మార్కెట్‌ను ప్రైవేటు స్థలంలో నిర్వహిస్తున్నారు. మూలపేటలోని మార్కెట్‌ను బీచ్‌రోడ్డులోని జిల్లా పరిషత్ పక్కనే నిర్వహిస్తున్నారు. అక్కడే చేపల వ్యర్థాలను వేయడం వలన దుర్వాసన వెదజల్లుతుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీకి ఆదాయం

మత్స్యకారుల కోసం నిర్మించిన షెడ్లలో వాపారాలు చేస్తే ఆశీల రూపంలో పంచాయతీలకు అదాయం లభిస్తుంది. ఆ నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. బీచ్‌రోడ్డులో ట్రాఫిక్ సమస్య కూడా తొలగిపోతుంది.

బదే హల్లెలూయ,
మత్స్యకార నాయకుడు, అమీనాబాద్

విపత్తుల నియంత్రణకు సంసిద్ధత అవసరం

- ఆర్డీఓ బీవీ రమణ
- కోరమాండల్‌లో ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణ

కాకినాడ రూరల్: పరిశ్రమల్లో విపత్తులను ఎదుర్కొనేందుకు సంసిద్ధత అవసరమని ఆర్డీఓ బీవీ రమణ పేర్కొన్నారు. రాష్ట్ర విపత్తుల నివారణ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న పారిశ్రామిక విపత్తులపై సంసిద్ధత, నష్ట నివారణపై నిర్వహించనున్న మాక్ డ్రిల్‌పై అవగాహన కోసం గురువారం వలసపాకలలోని కోరమాండల్ కర్మాగారంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాధాకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో రసాయనాల వల్ల జరిగే ప్రమాదాలపై యాజమాన్యాలు, ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పరిశ్రమకు ఒక నోడల్ అధికారిని యంత్రాంగం, ప్రజలకు సమన్వయ కర్తగా నియమించాలన్నారు. డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ మురళీకృష్ణ, జిల్లా అగ్నిమాపక అధికారి యేసుబాబు, పండూరు పీహెచ్‌సీ వైద్యాధికారి మాధవి, సీఐ మురళీకృష్ణ, కోరమాండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ పద్మనాభం, కర్మాగార భద్రతా అధికారి పీసీ రావు తదితరులు పాల్గొన్నారు.

బోన్ కేన్సర్ చికిత్సలో అధునాతన విధానాలు

- అవగాహన కల్పించిన వైద్య నిపుణులు
- కాకినాడ బోన్ క్లబ్ ఆధ్వర్యంలో సీఎంఈ

కాకినాడ క్రైం: కాకినాడ ఆర్థోపెడిక్స్ అసోసియేషన్ (బోన్ క్లబ్) ఆధ్వర్యంలో కాకినాడ హోటల్ జీఆర్‌టీలో సీఎంఈ (కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్) నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.నారాయణరావు, కార్యదర్శి డాక్టర్ ఎన్.పురుషోత్తమరావు అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సీఎంఈలో హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో వైద్య నిపుణుడు ఆర్థోపెడిక్ ఆంకోసర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, న్యూరోసర్జన్ డాక్టర్ బీజీ రత్నం అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. బోన్ కేన్సర్ చికిత్సలో అందుబాటులోకి వచ్చిన అధునాతన విధానాలపై డాక్టర్ రాజీవ్ మాట్లాడారు. తగిన వైద్య విధానాల ద్వారా రోగిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని తెలిపారు. డాక్టర్ బీఎస్ రత్నం మాట్లాడుతూ సర్వైకల్ డిస్క్ రీప్లేస్‌మెంట్‌లో భాగంగా శరీరంలో ఏ ఇతర భాగాన్నీ తొలగించకుండా, ప్రతికూల ప్రభావాలు పడకుండా శస్త్రచికిత్స అందించే అధునాతన విధానాలను తోటి వైద్యులకు వివరించారు. ఈ సీఎంఈలో ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ వై.నాగేశ్వరరావు, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ ఎస్ఎస్ మూర్తి, డాక్టర్ రమణారావుతో పాటు పలువురు ఆర్థోపెడిక్ వైద్యులు పాల్గొన్నారు.

సంక్షోభంలో శాగో

- నష్టాల్లో సగ్గు బియ్యం పరిశ్రమ
- వినియోగంలో తగ్గుతున్న ఆదరణ
- క్రమేణా తగ్గుతున్న సాగు విస్తీర్ణం


పెద్దాపురంలో దుంప తోట

సామర్లకోట: మండలంలో ప్రసిద్ధి చెందిన సగ్గు బియ్యం పరిశ్రమలు సంక్షోభంలో చిక్కుకుని కునుమరుగవుతున్నాయి. దుంప నుంచి సగ్గు బియ్యం తయారు చేసి ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, అస్సాం రాష్ట్రాలకు ఎక్కువగా సగ్గు బియ్యాన్ని పంపేవారు. తమిళనాడులోని సేలంలో తయారయ్యే సగ్గుబియ్యం పరిశ్రమతో ఎక్కువ పోటీ ఉండేది. ప్రస్తుతం 90 కేజీల సగ్గుబియ్యం బస్తా రూ.4,200 ఉంది. సగ్గు బియ్యాన్ని వినియోగించేవారి సంఖ్య తగ్గి పోవడంతో ఎగుమతులకు బ్రేక్ పడినట్టు వ్యాపార వర్గాల భావిస్తున్నాయి. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ ఈ పరిశ్రమలకు చేటు తెచ్చిందని పరిశ్రమల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడో ఒకప్పుడు పరిశ్రమకు మంచి రోజులు వస్తాయనే ఆశతో పరిశ్రమల యజమానులు ఉన్నారు.

తగ్గిపోతున్న దుంపసాగు....

జిల్లాలో గతంలో 40 వేల ఎకరాలలో ఉండే దుంప సాగు నేడు 15 వేల ఎకరాలకు పడి పోయింది. దీనికి తోడు దుంప దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోయింది. దాంతో రైతులు దుంపసాగుకు స్వస్తి చెప్పుతున్నారు. దుంప తీతకు సమయంలో వర్షాలు లేక పోవడం వల్ల ఆశించిన దిగుబడి రాలేదు. కాగా సగ్గుబియ్యం మిల్లర్లు పుట్టుకు (పుట్టు అంటే 225 కేజీలు) రూ.1400 మాత్రమే చెల్లిస్తున్నారు. ఇది రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదు. వర్షాలు సమృద్ధిగా ఉంటే ఎకరానికి 30 నుంచి 35 పుట్ల దిగుబడి ఉంటుంది. అయితే నేడు 20 నుంచి 25 పుట్లకు మించి దిగుబడి రావడం లేదు. దాంతో రైతులకు దుంప సాగు గిట్టుబాటు కాక ఆ పంటకు దూరం అవుతున్నారు.


క్రషింగ్‌కు వెళ్తున్న దుంపలోడు


సామర్లకోట మండలంలోని ఉత్పత్తి అయిన సగ్గుబియ్యం


పామోలిన్ తోటలపై దృష్టి



వర్షాలపై ఆధారపడి దుంప తోటలు సాగు చేయాల్సి ఉంటుంది. మిల్లర్లు ఇచ్చే ధర గిట్టుబాటు కావడం లేదు. సగ్గుబియ్యానికి డిమాండ్ లేక పోవడం వల్ల మిలర్లు రైతు లకు న్యాయం చేయలేకపోతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో 40 మిల్లులు ఉండేవి. మిల్లుల సంఖ్య తగ్గి పోవడంతో దుంపకు గిట్టుబాటు ధర లభించడం లేదు. దుంప సాగు చేసే రైతులు పామోలిన్ వైపు మళ్లి పొతున్నారు.

– పుట్టా సోమన్న, దుంప రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు, మర్రిపూడి

విద్యుత్ రాయితీ ఇవ్వాలి



సగ్గుబియ్యం పరిశ్రమలు పూర్తిగా విద్యుత్తుపై ఆధారపడి పని చేస్తాయి. దుంపను శుభ్రం చేయడం నుంచి వాటి నుంచి పాలు తీయడం, పిండి తయారు చేయడం, బియ్యం తయారు చేయడానికి పేనాలు ఉపయోగించే వరకు విద్యుత్ కావలసి ఉంటుంది. దాంతో ఈ పరిశ్రమల మనుగడకు విద్యుత్ రాయితీలు ఉండాలి. దీనికి తోడు జీఎస్టీ వల్ల పరిశ్రమలపై పెను భారం పడుతుంది. జీఎస్టీ లేకుండా చేసి ఉచిత విద్యుత్ ఇస్తే పరిశ్రమలకు ప్రోత్సాహం ఉంటుంది. సేలంలో పరిశ్రమలు కూడా అనేకం మూతపడ్డాయి.

– నెక్కంటి సత్యనారాయణ, సగ్గుబియ్యం పరిశ్రమ యజమాని, హుస్సేన్‌పురం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజప్ప

పెద్దాపురం రోడ్‌షోలో చంద్రబాబు ప్రకటన

సామర్లకోట: నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మూడోసారి నిమ్మకాయల చినరాజప్ప పోటీలో ఉంటారని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. జె తిమ్మాపురం నుంచి రోడ్ షోలో పాల్గొన్న చంద్రబాబు కట్టమూరు జంక్షన్, పెద్దాపురం గుర్రాల సెంటర్ నుంచి పెద్దాపురం మార్కెట్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయస్వామి సెంటర్‌లో బస్సు నుంచి ప్రసంగిస్తూ ఈ ప్రకటన చేశారు. దాంతో బొడ్డు వెంకటరమణ, గుణ్ణం చంద్రమౌళి వర్గీయులు నిరాశ వ్యక్తం చేశారు. బొడ్డు వర్గీయులు, జై బొడ్డు అంటూ నినాదాలు చేశారు. శుక్రవారం ఉదయం మండల పరిధిలోని వేట్లపాలెం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించి అనపర్తి నియోజకవర్గం చేరుకోనున్నారు.

వృత్తి విద్య నైపుణ్యాలు పెంచుకోవాలి

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వృత్తి విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో గురువారం స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు అప్రెంటీస్ విధానంలో కొత్తగా వచ్చిన మార్పులు వివరించారు. విద్యార్థులకు నైపుణ్యాలు లేకపోవడంతో వల్ల ఉద్యోగాలు సాధించలేకపోతున్నారని, దానికి గల కారణం తెలుసుకుని అందుకు తగ్గట్టుగా శిక్షణ ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాద రాజు, ఆర్‌డీడీ నాగవర్ధనరాజు, ప్రిన్సిపాల్ వర్మ, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, పాల్గొన్నారు.